క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

దామెర : అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు తోటి మిత్రులు. మండల కేంద్రానికి చెందిన కదం రవికి గతంలో గుండెపోటు రావడంతో వైద్యులు బైపాస్ సర్జరీ చేశారు. కోలుకుంటున్న క్రమంలో ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న తనతో పాటు డిగ్రీ చవుతున్న సమయంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్న మిత్రులు అండగా నిలిచారు. రూ. 50,800 పోగుచేసి శనివారం ఫోన్ పే ద్వారా రవికి అందించారు. సాయం చేసినవారిలో మాజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సీతారాం నాయక్, బాలస్వామి, మిత్రులు ప్రియప్రసన్న, సునీల్‌కుమార్, శ్రీనివాస్, నర్సింహ, ప్రవీణ్, చంద్రశేఖర్, నిరంజని, విజయ్‌కుమార్, మహేందర్, రఘుపతిరెడ్డి, మధు ఉన్నారు.

డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం



శాయంపేట : గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడంపై మండల కేంద్రంలోని ఎంజేపీ విద్యార్థులు సంబురాలు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని రేడియో స్టేషన్ ప్రాంతంలో ఉదయం 7.30గంటల నుంచి 9.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

వరంగల్: అకాల మరణం పొందిన కళాకారుల కుటుంబాలను పేద కళాకారులను ఆదుకునేందుకు కళా సంస్థలు కృషి చేయాలని బాలాజీ క్రియేషన్స్ అధినేత ఆడెపు రవీందర్ సూచించారు. హనుమకొండ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జేడీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ 25వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన ప్రముఖ జానపద గాయకులు శంకర్, సారంగపాణి జ్ఞాపకార్థం శ్రీబాలాజీ క్రియేషన్ అధినేత లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్‌కు సినీగేయ రచయిత వరంగల్ వాసి కాసర్ల శ్యామ్ చేతుల మీదుగా కీర్తి పురస్కార్ అవార్డును ప్రదానం చేశారు.

కేంద్ర మంత్రికి లేఖ

వరంగల్: అకాల వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీసీఐ కొనుగోలు చేస్తున్న పత్తిలో తేమ శాతం 15నుంచి 20శాతానికి పెంచాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాసినట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ 8నుంచి 12శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దీనికి తోడు పత్తి పంట దిగుబడులు తగ్గడంతో రైతులకు పెట్టుబడి వచ్చేది కూడా అనుమానంగా ఉందని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తేమ శాతం పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అగ్గి రవీందర్‌ను రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో రైల్వే డ్రైవర్ల కార్యాలయం క్రూ కంట్రోలర్ మినిస్టరల్ సిబ్బంది శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈమేరకు ఆయనను కార్యాలయ సూపరింటెండెంట్లు వస్కుల రవీందర్, లక్ష్మణ్‌రావు, తదితరులు సన్మానించారు.

కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభ

విద్యారణ్యపురి: రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో హనుమకొండ జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు హనుమకొండలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య శనివారం అభినందించారు. కూచిపూడి పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి కూచిపూడి పోటీలకు ఎంపికైన సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థి యజ్ఞశ్రీని, గాత్రం పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన సెయింట్ గాబ్రియల్ హైస్కూల్ విద్యార్థి దివ్యవెంకటరామన్‌ను కలెక్టర్ అభినందించారు. హనుమకొండ డీఈఓ వాసంతి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఉన్నారు.

ముళ్లపొదలతో ముప్పు



రాయపర్తి, నర్సక్కపల్లి దారిలో పెరిగిన ముళ్లపొదలు



పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారికిరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

- రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

నడికూడ : ప్రధాన రోడ్లతో పాటు గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రాణసంకటంగా మారాయి. మండలంలోని పలు లింక్‌రోడ్లు ముళ్ల పొదలతో మూసుకుపోయాయి. ఈ రోడ్లపై ప్రయాణించడం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది. ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదని ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలుమార్లు ప్రమాదాల బారిన పడినట్లు ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు.

జంకుతున్న వాహనదారులు

పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారికిరువైపులా పలుచోట్ల, నర్సక్కపల్లి నుంచి రాయపర్తి రోడ్డు కిరువైపులా, పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారి నుంచి వెల్లంపల్లికి వెళ్లే రోడ్డుకిరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగినట్లు వాహనదారులు తెలిపారు. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు గుర్తించకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలిగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



నర్సక్కపల్లి బస్‌స్టాప్ నుంచి వెల్లంపల్లికి వెళ్లే రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. పలుచోట్ల తుప్పలతో రోడ్లు మూసుకుపోయాయి. అధికారులు దృష్టి సారించాలి వాటిని తొలగింపజేయాలి.

- వరికెల కిషన్‌రావు, రైతు, నర్సక్కపల్లి

ప్రయాణించాలంటే భయం వేస్తుంది



రాయపర్తి నుంచి నర్సక్కపల్లికు వెళ్లాలంటే భయం వేస్తుంది. రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించడం లేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణం అంటే ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- బండి రఘుపతిగౌడ్, రాయపర్తి

హమాలీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన పరకాల వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మికుడు బొట్ల మొగిలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని హమాలీ సంఘం అధ్యక్షుడు లంకదాసరి అశోక్ డిమాండ్ చేశారు. మొగిలి మృతికి సంతాపంగా ఆదివారం మార్కెట్ బంద్ పాటించాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు కె.ఐలయ్య, కె.శంకర్, డబ్బా రాజయ్య, కె.శంకర్, ఎం.రవి, బి.భద్రయ్య, కె.యాదగిరి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న హమాలీ సంఘం నాయకులు

సంక్షిప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



వేలేరు : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈఓ చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయుడు గౌరిశెట్టి రాజన్న తెలిపారు. హనుమకొండ జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో ఇట్టబోయిన గణేశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 7,8,9 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈఓ, హెచ్ఎం, పీఈటీ సునీల్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా 'బల్మూరి' జన్మదినం



కమలాపూర్ : మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మిట్టపెల్లి సుభాష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.ఇమ్రాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయిని హనుమాన్ ప్రసాద్, మండల అధ్యక్షుడు అరవింద్, నాయకులు పోతిరెడ్డి ఓదెలు, పుల్ల శోభన్, కొండపాక మనీష్, శనిగరపు రమేశ్, చేరాల రోహిత్, దూడ శ్రీకాంత్, వైనాల వంశీకృష్ణ, సునీల్, పెనుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



పరకాల : బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను శనివారం పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత-రామకృష్ణ దంపతులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పర్యటిస్తున్న ఆయనను కలిసి అంబేడ్కర్ ప్రతిమను జ్ఞాపికగా అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పంచగిరి జయమ్మ, ఏకు రాజు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం, నల్లెల రాజు, మార్క రఘుపతిగౌడ్, పసుల రమేశ్ పాల్గొన్నారు.

మండల కమిటీ రద్దు

వేలేరు : బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీని రద్దు చేసి ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ఇన్‌చార్జ్‌గా మండల కేంద్రానికి చెందిన ఇట్టబోయిన భూపతిరాజును నియమించినట్లు తెలిపారు. నూతన మండల కమిటీలను ఏర్పాటు చేసే వరకు మండల కో ఆర్డీనేటర్లు, మండల ఇన్‌చార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కమలాపూర్ : ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని భీంపల్లిలో తాళ్లపల్లి పోచయ్య జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ ఎన్ఆర్ఐ వైద్యుడు డాక్టర్ నేరెళ్ల దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. భీంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఉచిత వైద్యశిబిరంలో వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ దామోదర్ కోరారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్



ఎల్కతుర్తి : గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ పులి రమేశ్ శనివారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఎల్కతుర్తి మండలం సూరారం ఎల్లమ్మ గుడి వద్ద యువకులు గంజాయి సేవిస్తున్నట్లు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. సూరారం గ్రామానికి చెందిన కుర్ర అభినేష్, మొలుగూరి నవీన్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీ సంతోశ్‌కుమార్ సాహూ అనే ముగ్గురు గంజాయి సేవిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ సారంగపాణి, విఠల్, బక్కయ్య, మల్లేశం, రాజన్న, నిరంజన్, రంజిత్, వలీ, స్వరూప పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



ఐనవోలు : అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఐదు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పంథిని గ్రామంలో ఐదు టిప్పర్ల ద్వారా అక్రమంగా మొరం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్ యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ సీపీఐ నాయకుడి మృతి

దామెర : చికిత్స పొందుతూ సీపీఐ నాయకుడు మృతి చెందారు. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన అంబి సాంబయ్య దామెరలో స్థిరపడ్డాడు. కాగా సీపీఐ మండల కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. అయితే ఇటీవల గుండె జబ్బుతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతిచెందాడు. సాంబయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. ఆయన మృతి పట్ల జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి, కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

వ్యాపారులు సకాలంలో ఫీజులు చెల్లించాలి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ టమాట-పండ్ల వ్యాపారులు సకాలంలో అద్దె కిరాయిలు, మార్కెట్ ఫీజులను బకాయిలు లేకుండా చెల్లించాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల కోరారు. మార్కెట్ ప్రధాన కార్యాలయంలోని టమాట వ్యాపారులతో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా పండ్ల వ్యాపారులు మార్కెట్‌లోని సమస్యలను కార్యదర్శికి వివరించారు. కూరగాయల మార్కెట్‌లో ఆవులు, మేకలు సంచరించడం వలన వినియోగదారులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరారు. మార్కెట్‌లో ఖరీదు వ్యాపారులకు, వినియోగదారుల వాహనాలకు సరిపడా పార్కింగ్ స్థలం కేటాయించామని కార్యదర్శి తెలిపారు. సమావేశంలో కార్యదర్శి గ్రేడ్-2 ఎన్.రాము, సహాయ కార్యదర్శి రాజేందర్, పర్యవేక్షకుడు మురళియాదవ్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్, టమాట మార్కెట్ వ్యాపారస్తులు మజీద్ అహ్మద్ బాబా, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

మామునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. వరంగల్ తిమ్మాపురం లక్ష్మీపురంలోని ఏచూరి ప్రాంగణంలో తోట మల్లయ్య అధ్యక్షతన సీపీఎం శాఖల మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు.

పంచకూట ఆలయం ప్రతిష్ఠాపనకు రెడీ



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న నూతనంగా నిర్మించిన శివాలయం

ఆత్మకూరు : మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న కాకతీయుల కాలంలో నిర్మించిన పంచకూట శివాలయాన్ని ఐదేళ్లపాటు శ్రమించి గ్రామస్తులు నూతన ఆలయాన్ని నిర్మించుకున్నారు. పాత ఆలయం స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించడంపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయం ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈనెల 6నుంచి 8వరకు జరగనున్నాయి.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



అన్నదానం చేస్తున్న రాజేందర్‌రెడ్డి దంపతులు

పరకాల : పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కోమాళ్లపల్లి సంపత్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి దంపతులు భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి



సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

దామెర : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని బీజేపీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు అన్నారు. మండలంలోని దుర్గంపేట్‌లో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ సభ్యత్వం పొందుతున్నారని అన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని అన్నారు. ప్రతీ బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షుడు గుట్ట రమేశ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పొడాల మధూకర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సూర చందర్, గండు పరశురాం, ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మిద్దెపాక రవీందర్

ఐనవోలు : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఈనెల 4న హసన్‌పర్తి కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జేఏసీ నాయకుడు మిద్దెపాక రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని తీర్పునిచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం రాష్ట్రంలో వర్గీకరణ ప్రణాళిక చేపడుతామని చెప్పారని, కానీ వర్గీకరణ అమలు చేయకుండానే నియామకాలు చేపట్టారని అన్నారు. దీంతో ఎస్సీ ఉపకులాలకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతూ పార్టీలకు, సంఘాలకు అతీతంగా నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో ఉమ్మడి జిల్లాలోని మేధావులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జన్ను రాములు, జన్ను నర్సయ్య, కంచర్ల మహేష్, బరిగల స్వామి, మంద రవీందర్, కట్కూరి శరత్‌బాబు, తాటికాయల కొమురయ్య, తాటికాయల స్వామి, మారయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ


కమలాపూర్ : మండలంలోని యువత, ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, హసన్‌పర్తి సీఐ చేరాలు అన్నారు. మండలంలోని మర్రిపల్లిగూడెంలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహన తనిఖీలు చేపట్టి పత్రాలు లేని 30 మంది వాహనదారులకు జరిమానా విధించారు. కంకటి సూర్యంకు చెందిన హోటల్‌లో 20 బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన, సీసీ కెమెరాల ఉపయోగాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యువత పెడదారులు పట్టొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు దేవేందర్, రవి, సిద్దయ్య, సాయిబాబు, దివ్య, 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

శాయంపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉత్తర తెలంగాణ మహిళా కళాకారుల కన్వీనర్ వైద్యుల రజిత శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులు కీలక పాత్ర పోషించారని, గత ప్రభుత్వం కళాకారులను పట్టించుకోకుండా అన్యాయం చేసిందని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సాంస్కృతిక సారథిలో వెయ్యి ఉద్యోగాలు ఇవ్వాలని, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద రూ.10 లక్షల సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధ కళాకారులకు రూ.25 వేల పెన్షన్, ఇళ్లు లేని కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈనెల 5న వరంగల్ రైల్వే స్టేషన్, బాపూజీ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే జిల్లా ఉద్యమ కళాకారుల సదస్సులో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

బీరు సీసాలో పురుగులు

- అవాక్కైన మద్యం ప్రియులు



బీరు సీసాలో కనిపిస్తున్న పురుగు

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో గల నాగేంద్ర వైన్స్‌లో కల్తీ మద్యం, బీరు సీసాల్లో పురుగులు వస్తున్నట్లు మద్యం ప్రియులు విమర్శిస్తున్నారు. శనివారం అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు వైన్స్‌లో కింగ్ ఫీషర్ ప్రీమియం బీర్లు తీసుకోగా అందులోని ఓ బీరు సీసాలో పురుగు అవశేషాలు కన్పించింది. దీంతో వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదే విషయాన్ని వైన్స్ యజమాన్యానికి చెప్పగా వారిని మభ్యపెట్టి ఎవరికి చెప్పొద్దని బేరసారాలతో వారికి వేరే బీర్లు ఇచ్చినట్లు సమాచారం. గ్రామంలోని వైన్స్‌లో నాణ్యత లేని బీర్లు సరఫరా చేస్తున్నారని, బ్రాండెడ్ బీర్లను బెల్టు షాపులకు విక్రయిస్తూ సాధారణ బీర్లను కస్టమర్లకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుర్తింపు లేని బీర్ల కంపెనీలు ఇచ్చే కమీషన్లకు వైన్స్ యాజమాన్యం తలొగ్గి కస్టమర్లకు నాసిరకం బీర్లు అంటగడుతున్నారనే ఆరోపణలు వినివస్తున్నాయి. దీనితో పాటు వైన్స్ షాపులో జోరుగా మద్యాన్ని కల్తీ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి ఆ వైన్స్ షాపులో తనిఖీలు నిర్వహించాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.